



జడ్పీ కార్యాలయం

సంగారెడ్డి జడ్పీ ప్రత్యేకాధికారిగా
కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, జూలై 5 : సంగారెడ్డి జడ్పీ ప్రత్యేకాధికారిగా కలెక్టర్ వల్లూరు క్రాంతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా పరిషత్ సభ్యుల పదవీకాలం గురువారంతో ముగియడంతో ప్రత్యేకాధికారిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆమె బాధ్యతలు స్వీకరించారు. తిరిగి ప్రభుత్వం ఉత్తర్వులు వచ్చే వరకు ప్రత్యేకాధికారిగా కొనసాగనున్నారు.



సంగారెడ్డి జిల్లా పరిషత్ కార్యాలయంలో ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి



అన్నదాత అగచాట్లు

వరి నారుకు..
బిందెలతో నీరు..

వర్షాలు ముఖం చాటేయడంతో రైతులు దిక్కులు చూస్తున్నారు. తుకాలు ఎండిపోతుండటంతో వాటిని కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. చిన్నశంకరంపేట మండలం జంగరాయి గ్రామంలో వరి తుకం ఎండిపోకుండా రైతు దంపతులు పక్కనే ఉన్న చెరువు నుంచి ఇలా బకెట్లు, బిందెలతో నీటిని తెచ్చి పోస్తున్నారు.

- చిన్నశంకరంపేట

కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం



మెదక్‌లో బీజేవైఎం నేతలను అరెస్టు చేస్తున్న పోలీసులు

మెదక్ అర్బన్, జూలై 5: నిరుద్యోగుల సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బీజేవైఎం చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తంగా మారింది. పెద్దఎత్తున తరలివచ్చిన బీజేపీవైఎం నేతలు, కార్యకర్తలు కలెక్టరేట్‌లోకి చొచ్చుకొని వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట జరిగి ఉద్రిక్తంగా మారింది. పోలీసులు ఆందోళనకారులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. పోలీసుల తీరుపై బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి అరవింద్‌గౌడ్ మండిపడ్డారు. నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని, 25 వేలతో మోగా డీఎస్సీ నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి

సంగారెడ్డి అర్బన్ : బీజేవైఎం ఆధ్వర్యంలో శుక్రవారం సంగారెడ్డి కలెక్టరేట్‌ను ముట్టడించారు. కలెక్టరేట్ ఎదుట బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీజేవైఎం నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి సంగారెడ్డి రూరల్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ మాట్లాడుతూ గ్రూప్ 2, గ్రూప్ 3 నోటిఫికేషన్లలో పోస్టులు పెంచాలని, గ్రూప్ 1 ప్రిలిమ్స్‌లో 1:100 ప్రకారం క్వాలిఫై చేయాలని, అన్ని నియామకాల్లో మహిళా అభ్యర్థులకు 33 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. జాబ్ క్యాలెండర్ వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సందీప్, సాయితేజ, ప్రసాద్, ఉపాధ్యక్షుడు ప్రశాంత్, మెదక్ పార్లమెంట్ కో కన్వీనర్ ఆదిత్య, అధికార ప్రతినిధి మోహన్, అసెంబ్లీ కన్వీనర్ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ప్రక్షాళన

65 ఏళ్లు నిండిన టీచర్లు, ఆయాల తొలగింపు

- ఆందోళన బాటలో టీచర్లు.. ఆయాలు
- రిటైర్మెంటు బెనిఫిట్లపై నిరసన గళం
- ఇప్పటికే 135 చోట్ల టీచర్లు.. 782 సెంటర్లలో ఆయాలు లేరు
- తాజా నిర్ణయంతో భారీగా పెరిగిన ఖాళీలు
- కొత్త నోటిఫికేషన్‌పైనే మహిళల ఆశలు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జూలై 5: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రక్షాళన ప్రారంభమైంది. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 65 సంవత్సరాలు నిండిన టీచర్లు, ఆయాలను తొలగిస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. రిటైర్‌మెంటు బెనిఫిట్ కింద టీచర్‌కు రూ.లక్ష, ఆయాకు రూ.50వేలు ప్రకటించింది. దీనిపై ఆ వర్గాల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతున్నది. మరోపక్క గతంలో ఉన్న ఖాళీలతోపాటు ప్రస్తుత ఖాళీలను భర్తీ చేయనున్నారు. దీంతో కొత్త నోటిఫికేషన్‌పై మహిళా నిరుద్యోగులు ఆశలు పెట్టుకున్నారు.

సిబ్బందిలో ఆందోళన..

ప్రభుత్వ తాజా నిర్ణయంతో అంగన్‌వాడీ సిబ్బంది తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. తమకు రిటైర్‌మెంటు బెనిఫిట్స్ విషయంలో ప్రభుత్వం అన్యాయం చేసిందని వాదిస్తున్నారు. గతంలో తాము దీక్షలు చేసిన సందర్భంలో నాటి ప్రభుత్వం హామీలు ఇచ్చిందని గుర్తు చేస్తున్నారు. ఈ ప్రభుత్వం కొలువుదీరాక స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సైతం మాటిచ్చారని చెబుతున్నారు. 65 ఏళ్లకు రిటైర్‌మెంటు కాగానే టీచర్‌కు రూ.2 లక్షలు, ఆయాకు రూ.లక్ష చొప్పున ఇస్తామని ప్రకటించి ఇప్పుడేమో సగానికే పరిమితం చేశారని ఆగ్రహిస్తున్నారు. తమను అన్ని పనుల్లోనూ భాగస్వామ్యం చేసి తగిన ప్రయోజనాన్ని మాత్రం చేకూర్చడం లేదని ఆవేదన చెందుతున్నారు. దీనిపై జిల్లాల వారీగా నిరసన కార్యక్రమాలు, నిరాహారదీక్షలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

వేతనంలో సగం పెన్షన్ అందజేయాలి



మేము చేసే పనులతో పాటు అదనంగా పనులు చెబుతున్నారు. సర్వేల పేరిట భారం మోపుతున్నారు. కానీ, అదనంగా ఎలాంటి జీతభత్యాలు ఇవ్వడం లేదు. 2017 నుంచి టీఏ, డీఏలు కూడా అందజేయలేదు. రిటైర్మెంటు బెనిఫిట్స్ కింద టీచర్లకు రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష మంజూరు చేయాలి. రిటైర్మెంటు సమయంలో పొందిన వేతనంలో సగం మొత్తాన్ని పెన్షన్ రూపంలో ఇవ్వాలంటున్నాం.

- పద్మ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్
అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్(సీఐటీయూ)

నోటిఫికేషన్‌పై ఆశలు

65ఏళ్లు నిండినవారి స్థానంతోపాటు గతంలో ఉన్న ఖాళీలను భర్తీ చేయడానికి త్వరలోనే ప్రభుత్వం కొత్త నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నది. దీనిపై మహిళా నిరుద్యోగులు ఆశలు పెట్టుకున్నారు. ఇంటర్ ఆపైనా అర్హత ఉన్నవారికి టీచర్లు, ఇంటర్ అర్హత ఉంటే ఆయాలుగా ఎంపిక చేయడానికి నిర్ణయిస్తున్నారు. ప్రధానంగా ఈ ఉద్యోగాలను కలెక్టర్ల ఉత్తర్వులతో ఆర్డీవోల పర్యవేక్షణలో ఎంపిక చేస్తుంటారు. గతంలోనూ రాజకీయపరమైన పైరవీలతో ఉద్యోగాలు పొందిన దాఖలాలు ఉన్నాయి. ఇప్పుడు కూడా పైరవీలకు ఆస్కారం ఉంటుందా.. లేక రాతపరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేస్తారా అనే విషయంపై అస్పష్టత నెలకొంది. అయితే ఖాళీగా ఉన్న సెంటర్ల పరిధిలో పైరవీలు ఊపందుకున్నాయి. అధికార పార్టీ నేతల చుట్టూ ప్రదక్షిణలు చేయడం ప్రారంభిస్తున్నారు.

ఉమ్మడి మెదక్ జిల్లాలో అంగన్‌వాడీ సిబ్బంది వివరాలు

జిల్లా	సంగారెడ్డి	సిద్దిపేట	మెదక్
మొత్తం సెంటర్లు	1504	1150	1076
టీచర్లు లేని సెంటర్లు	40	62	33
ఆయాలు లేని సెంటర్లు	304	149	279
65 ఏళ్లు నిండిన టీచర్లు	39	16	06
65 ఏళ్లు నిండిన ఆయాలు	110	110	73
కొత్తగా భర్తీ చేసే టీచర్ల సంఖ్య	79	78	39
కొత్తగా భర్తీ చేసే ఆయాల సంఖ్య	414	259	352





డాక్టర్లు రారు.. సిబ్బంది ఉండరు!

జిల్లా ఆస్పత్రుల్లో సమస్యల తిష్ఠ

- పట్టించుకోని అధికారులు
- అడుగడుగునా నిర్లక్ష్యం
- ఇన్‌చార్జి పాలనతో పర్యవేక్షణ ఆగమాగం
- కలెక్టర్, ఎమ్మెల్యేల తనిఖీల్లో బయటపడ్డ లోపాలు
- జడ్పీ సమావేశంలో మంత్రి ఆగ్రహం

సంగారెడ్డి అర్బన్, జూలై 5 : సంగారెడ్డి జిల్లాలోని సర్కారు దవాఖానాలపై జిల్లా వైద్యాధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఈ నెల 4న జడ్పీ సర్వసభ్య సమావేశంలో పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు లేవనెత్తిన ప్రశ్నలు, సమస్యలు వైద్య ఆరోగ్యశాఖ పనితీరుకు అద్దంపడుతున్నాయి. జిల్లాలోని ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పల్లె దవాఖాన, బస్తీ దవాఖానాల్లో వైద్య సేవల గురించి పట్టించుకునే వారే కరువయ్యారు. ఫలితంగా జిల్లాలోని పలు ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందని ద్రాక్షలా మారాయన్న ఆరోపణలున్నాయి. జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కలెక్టర్, ఎమ్మెల్యేల తనిఖీల్లో లోపాలు

జహీరాబాద్ ఏరియా ఆస్పత్రిని గత నెల 12న ఎమ్మెల్యే తనిఖీ చేశారు. ఈ క్రమంలో హాజరు రిజిస్టర్‌లో డాక్టర్లు, సిబ్బంది సంతకాలు చేయకపోవడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. 40 మందికి 15 మందే విధుల్లో ఉండడం పట్ల మండిపడ్డారు. అదే విధంగా గత నెల 19 న సిర్గాపూర్ పీహెచ్‌సీని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి తనిఖీ చేశారు. అక్కడి రికార్డు అసిస్టెంట్ నెల పదిహేను రోజులుగా గైర్హాజరవడం, ఎల్‌టీ డిప్యూటేషన్‌లో పంపడం, అలాగే డేటా ఎంట్రీ ఆపరేటర్ సైతం విధులకు హాజరుకాకపోవడాన్ని గుర్తించి అసంతృప్తి వ్యక్తం చేశారు. గత నెల 26న కలెక్టర్ వల్లూరు క్రాంతి జహీరాబాద్ ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేసి పడకలపై బెడ్‌షీట్లు లేకపోవడం, డాక్టర్లు యాప్రాన్ ధరించకపోవడం పట్ల ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలు పాటించాలని విధుల పట్ల నిర్లక్ష్యంగా వహిస్తే చర్యలు తప్పవంటూ ఆమె హెచ్చరించారు. ఇక అదేరోజు నారాయణఖేడ్ ఏరియా ఆస్పత్రిని ఎమ్మెల్యే సంజీవరెడ్డి తనిఖీ చేయగా.. విస్తుపోయే అంశాలు వెలుగులోకి వచ్చాయి. సెలవు పెట్టకుండా సూపరింటెండెంట్, ఆర్‌ఎంవోలు గైర్హాజరవడం, ఇద్దరు ఫార్మసిస్టులు డిప్యూటేషన్‌పై ఉన్నట్లు గుర్తించారు. ఈక్రమంలో ఇద్దరు ఫార్మసిస్టులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆదేశించారు. కానీ, వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తున్నది. ఇటీవల జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశంలోనూ ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, జడ్పీటీసీలు ఆస్పత్రుల్లో మందుల కొరతపై జిల్లా వైద్యాధికారులను నిలదీశారు. దీంతో మంత్రి దామోదర్ అధికారుల తీరుపై అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక సంగారెడ్డి జీజీహెచ్‌లోనూ పలువురు స్పెషాలిటీ, సూపర్‌స్పెషాలిటీ డాక్టర్లు ఇలా వచ్చి అలా వెళ్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు దృష్టిసారించి అన్ని సర్కారు ఆస్పత్రుల్లో డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటించేలా కఠిన చర్యలు తీసుకుంటేనే వైద్య సేవలు సక్రమంగా అందే అవకాశాలున్నాయి.

జిల్లా కేంద్రానికే పరిమితం

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేయాల్సిన జిల్లా వైద్యాధికారులు, ప్రోగ్రాం ఆఫీసర్లు జిల్లా కేంద్రానికే పరిమితమవుతున్నారనే విమర్శలున్నాయి. ఒక వేళ తనిఖీలకు వెళ్తే అప్పటికప్పుడు హడావుడి చేసి సంబంధిత విజిట్ ఫోటోలను ఉన్నతాధికారులకు పంపి నామమాత్రంగా మమ అనిపించేస్తున్నారనే ఆరోపణలున్నాయి. జిల్లా వైద్యాధికారులతో పాటు ప్రోగ్రాం ఆఫీసర్లకు వాహన రవాణా భత్యం ఇచ్చి నిత్యం పర్యటించాలని ఉన్నతాధికారులు తరచూ సూచిస్తున్నా..వారు పెడచెవినపెట్టి పర్యవేక్షణ గాలికి వదిలేస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. క్షేత్ర స్థాయిలో పర్యటనలు చేయకుండా ప్రతీ నెల వాహన రవాణా భత్యాన్ని మిగిలించుకుని కాజేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. జిల్లా వైద్యాధికారులు ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సందర్శించకపోవడంతో ఆయా ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు సైతం విధుల పట్ల నిర్లక్ష్యం, అలసత్వం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.



సంగారెడ్డిలోని డీఎంహెచ్‌వో కార్యాలయం

ఏళ్ల తరబడి ఇన్‌చార్జిల పెత్తనం

జిల్లాలో కొంత కాలంగా ఇన్‌చార్జి జిల్లా వైద్యాధికారులు పాలన కొనసాగుతున్నది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో భాగంగా మూడున్నరేళ్లుగా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో పాలన కొనసాగుతున్నది. అదే విధంగా టీవీవీపీ పరిధి కింద ఇన్‌చార్జి డీసీహెచ్‌ఎస్ కూడా కొన్నేళ్లుగా ఇక్కడే పనిచేస్తూ వస్తున్నారు. వీరిరువురు దాదాపు పదేళ్లుగా ఇదే జిల్లాలో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తూ వస్తున్నారు. 2021 లో రెగ్యులర్ డీఎంహెచ్‌వోను జిల్లాకు నియమించినప్పటికీ జిల్లా యంత్రాంగం విధులు అప్పగించేందుకు విముఖత వ్యక్తం చేసింది. జిల్లావ్యాప్తంగా పర్యటనలు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందేలా ఆస్పత్రులను గాడిన పెట్టాల్సిన వీరి పనితీరుపై తాజాగా జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోతో పాటు డీసీహెచ్‌ఎస్‌పై మంత్రి దామోదర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ వల్లూరు క్రాంతి కూడా గుర్రుగా ఉన్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో వారిపై చర్యలకు తీసుకునేందుకు ఉన్నతాధికారులకు సిఫారసు చేసే అవకాశం లేకపోలేదని ఆ శాఖ వర్గాలు తెలిపాయి.



జడ్పీ సర్వసభ్య సమావేశంలో జిల్లా వైద్యాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మంత్రి దామోదర్ (ఫైల్)



జోగిపేట ఆస్పత్రిలో పేషెంట్‌తో మాట్లాడుతున్న జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ సంగారెడ్డి

జోగిపేట ఆస్పత్రికి
రూ. 2 కోట్లు

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి చొరవతో విడుదల
- అందోలులో నర్సింగ్ కాలేజీ, 100 పడకల ఆస్పత్రి
- 50 పడకలతో మాతాశిశు కేంద్రం
- జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ సంగారెడ్డి

జోగిపేట, జూలై 5: వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ చొరవతో జోగిపేట ఏరియా ఆస్పత్రి అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ సంగారెడ్డి పేర్కొన్నారు. జోగిపేట ఏరియా ఆస్పత్రిని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. జోగిపేట ఏరియా ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పన కోసం రూ. 2 కోట్ల నిధులు విడుదలయ్యాయని తెలిపారు. ఈ నిధులతో, ఆస్పత్రి ఆవరణలో డ్రైనేజీ, సీసీ రోడ్లు, మార్చురీ గది, ప్రహరీ నిర్మాణం తదితర పనులను చేపట్టనున్నట్టు పేర్కొన్నారు.

అందోలులో నర్సింగ్ కాలేజీ, ఆస్పత్రి

అందోలు పట్టణంలో 50 సీట్ల మహిళా నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేయనున్నట్టు సంగారెడ్డి తెలిపారు. దీనికి అనుబంధంగా 100 పడకల ఆస్పత్రిని మంజూరు చేశారని తెలియజేశారు. అదనంగా మరో 50 పడకలతో కూడిన మాతాశిశు ఆస్పత్రి (ఎంసీహెచ్)ను కూడా మంజూరు చేశారని పేర్కొన్నారు.

ఆస్పత్రిలో తనిఖీ

జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ సంగారెడ్డి జోగిపేట ఏరియా ఆస్పత్రిలో తనిఖీలు చేపట్టారు. రికార్డులను పరిశీలించారు. వార్డులను పరిశీలించి, రోగులతో మాటాడి వైద్య సేవలు, సౌకర్యాలను గురించి ఆరా తీశారు. సూపరింటెండెంట్ డాక్టర్ రమేశ్‌ను అడిగి ఆస్పత్రిలో సమస్యలను తెలుసుకున్నారు. ఆయనవెంట వైద్యాధికారి డాక్టర్ శంకర్‌బాబు, సిబ్బంది ఉన్నారు.



చలో హైదరాబాద్ పిలుపు నేపథ్యంలో..

తూప్రాన్ టోల్‌ప్లాజా వద్ద చెక్‌పోస్ట్



తూప్రాన్ టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ


తూప్రాన్, జూలై 5: విద్యార్థి సంఘాలు, యువజన నాయకుల ముట్టడి కార్యక్రమాల నేపథ్యంలో పోలీసులు కట్టడి చర్యలు చేపట్టారు. టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం చెక్‌పోస్టు ఏర్పాటు చేసి వాహనాల తనిఖీ చేపట్టారు. తూప్రాన్ టోల్‌ప్లాజా వద్ద తూప్రాన్ పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. విద్యార్థి సంఘాలు టీజీఎస్‌పీఎస్సీ, అసెంబ్లీ, కలెక్టరేట్ల ముట్టడికి బీఆర్‌ఎస్‌వీ, ఎస్‌ఎఫ్‌ఐ, బీజేవైఎం తదితర సంఘాలు పిలుపునిచ్చాయి. ఒకేరోజు విద్యార్థి సంఘాలు, యూత్ నాయకులు హైదరాబాద్‌లో ఆందోళనకు పిలుపునివ్వడంతో తూప్రాన్ ఎస్‌ఐ శివానందం ఆధ్వర్యంలో చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. హైదరాబాద్ వైపు వెళ్లే కార్లు, అనుమానిత వాహనాలు, బస్సులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

నేడు 'జీనోసిస్ డే' సందర్భంగా రేబిస్ వ్యాక్సిన్

నర్సాపూర్, జూలై 5: ఈ నెల 6న ప్రపంచ జీనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో శనివారం ఉచితంగా రేబిస్ వ్యాక్సిన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నర్సాపూర్ ఏడీ డాక్టర్ జనార్దన్‌రావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నర్సాపూర్‌లోని పశువైద్యశాలలో నిర్వహించే ఈ కార్యక్రమంలో పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు తెలిపారు. మూడు నెలలు దాటిన కుక్కలకు వాటి యజమానులు తప్పనిసరిగా ఈ టీకా వేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీనోటిక్ వ్యాధులు అనగా పశువుల నుంచి మనుషులకు వచ్చే జబ్బులని చెప్పారు. వీటిలో రేబిస్, ఆంత్రాస్, బ్రూసిల్లోస్ వంటివి ఉన్నాయన్నారు. శనివారం ప్రపంచ జీనోసిస్ దినోత్సవం సందర్భంగా పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా టీకాలు వేయనున్నందున ఈ అవకాశాన్ని కుక్కలను పెంచేవారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యార్థులకు మెను ప్రకారం భోజనం అందించాలి

చిన్నశంకరంపేట, జూలై 5: విద్యార్థులకు మెను ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని మెదక్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి విజయలక్ష్మి వార్డెన్ సత్యనారాయణకు సూచించారు. శుక్రవారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని ఎస్టీ వసతి గృహాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వసతి గృహంలో వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇక్కడ ఏమైన ఇబ్బందులు ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నాడు. చదువుపై దృష్టి పెట్టి ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. వసతిగృహం స్థితి గతులపై హాస్టల్ వార్డెన్‌తో చర్చించారు.



మాదారం స్టోన్ క్రషర్లపై చర్యలు తీసుకోవాలి

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతికి స్థానికుల వినతి

జిన్నారం, జూలై 5: సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం మాదారంలో స్టోన్‌క్రషర్లతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతిని కలిసి ఫిర్యాదు చేశారు. శుక్రవారం సంగారెడ్డిలో కలెక్టర్‌ను మాదారం గ్రామానికి చెందిన నాయకులు రాజుగౌడ్ తదితరులు కలిసి క్రషర్ల తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామానికి సమీపంలో ఉన్న స్టోన్‌క్రషర్లతో నిత్యం పేలుళ్ల శబ్దాలు, ధ్వని, వాయు కాలుష్యం అవుతున్నదని, వ్యవసాయ రంగానికి కంకర మిషన్లతో ప్రమాదం నెలకొందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కొత్త క్వారీలకు అనుమతులు ఇవ్వొద్దని కలెక్టర్‌ను కోరినట్లు గ్రామ నాయకులు, ప్రజలు తెలిపారు.

'నీట్' అభ్యర్థులకు న్యాయం చేయండి

సంగారెడ్డి రూరల్, జూలై 5 : నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించినా కేంద్ర ప్రభుత్వం మాత్రం స్పందించడం లేదని తీన్మార్ మల్లన్నకమిటీ రాష్ట్ర సభ్యుడు నరేష్‌యాదవ్ విమర్శించారు. సంగారెడ్డిలో శుక్రవారం కలెక్టర్ క్రాంతిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్షను రద్దు చేసి, కష్టపడిన విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. అదే విధంగా సంగారెడ్డిలో కుక్కల బెడదతో చిన్నారులు గాయాలపాలవుతున్నారని, వీధి కుక్కలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో విజయ్, సచిన్, తుకారాం, నరేష్ ఉన్నారు.



సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతికి సమస్య విన్నవిస్తున్న స్థానికులు

కాజీపల్లి కాలుష్య సమస్యను పార్లమెంటులో ప్రస్తావించండి



ఎంపీ రఘునందన్‌రావును కలిసిన బీజేపీ, జేఏసీ నాయకులు

జిన్నారం, జూలై 5: కాజీపల్లి పరిధిలో నెలకొన్న పారిశ్రామిక కాలుష్యంపై పార్లమెంటు సమావేశాల్లో ప్రస్తావించాలని జేఏసీ నాయకులు విజ్ఞప్తి చేశారు శుక్రవారం కాజీపల్లి జేఏసీ, మండల బీజేపీ నాయకులు ఎంపీ రఘునందన్‌రావును కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరిశ్రమల కాలుష్యంతో మూడు దశాబ్దాలుగా ప్రజలు, మూగజీవాలు నష్టపోతున్న తీరును వివరించారు. పార్లమెంటు సమావేశాల్లో కాలుష్యం అంశాన్ని ప్రస్తావించి, సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీకి వినతి పత్రం అందజేశారు. ఎంపీని కలిసినవారిలో బీజేపీ నాయకులు జగన్‌రెడ్డి, నర్సింగరావు, జేఏసీ నాయకులు రమాకాంత్, కుమార్‌యాదవ్, సురేష్ తదితరులు ఉన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలి: సీఐటీయూ



సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపీవోకు వినతిపత్రం అందజేస్తున్న పారిశుధ్య కార్మికులు

శివ్వంపేట, జూలై 5: పారిశుధ్య కార్మికుల పెండింగ్ వేతనాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో మండల పారిశుధ్య కార్మికులు శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికులతో కలిసి వారికి మద్దతుగా ఆందోళన నిర్వహించారు. అనంతరం ఎంపీవో తిరుపతిరెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ మల్టీ పర్పస్ రద్దుపై ప్రభుత్వం అలసత్వం సరైంది కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఒక్క హామీ పంచాయతీ కార్మికులకు అమలు చేయలేదని విమర్శించారు. సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్కను పలుమార్లు కలిసినా సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు ఐదు నెలల నుంచి వేతనాలు రాకుంటే వారి కుటుంబాలు ఎలా గడుస్తాయని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే పారిశుధ్య కార్మికుల పెండింగ్ వేతనాలను విడుదల చేసి, వారి సమస్యల పరిష్కారాన్ని కృషి చేయాలని డిమాండ్ చేశారు.

కేతకీలో అమావాస్య పూజలు




శ్రీకేతకీ సంగమేశ్వరాలయంలో దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

ఝరాసంగం, జూలై 5: దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీకేతకీ సంగమేశ్వరాలయంలో శుక్రవారం అమావాస్య సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కర్ణాటక, మహారాష్ట్రలతోపాటు సంగారెడ్డి జిల్లా నలుమూలల నుంచి భక్తులు స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. ఉదయం అమృతగుండంలో స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల ప్రత్యేక పూజలతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ సిబ్బంది, ఆలయ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అదేవిధంగా మండలపరిధిలోని బర్ధీపూర్, మాచ్నూర్ గ్రామశివారలో గల రామేశ్వరాలయంలో భక్తులు ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ ఆవరణలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కాగా శ్రీకేతకీ సంగమేశ్వర స్వామి హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించనున్నట్టు ఆలయ ఈవో శశిధర్ తెలిపారు. ఉదయం 11 గంటలకు హుండీ లెక్కింపు ఉంటుందన్నారు.

భగలాముఖి ఆలయంలో ఘనంగా మహామంత్ర హవనం

శివ్వంపేట, జూలై 5: మండల కేంద్రమైన శివ్వంపేటలో కొలువైన శక్తిపీఠం భగలాముఖి ఆలయంలో అమావాస్య సందర్భంగా శుక్రవారం ఆలయ వ్యవస్థాపకులు వెంకటేశ్వరశర్మ, ప్రధాన పూజారి సంతోష్‌శర్మల ఆధ్వర్యంలో అమ్మవారికి మహా పూజ నిర్వహించారు. ముందుగా ఆలయంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం చేసి, ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం మహామంత్ర హవనం నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకొని ఒడిబియ్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.







మెదక్ డిపో.. తంతాలు డిటో..!



మెదక్ ఆర్టీసీ బస్టాండ్

- ఆర్టీసీ కార్మికులపై పనిభారం
- అదనపు డ్యూటీలతో ఒత్తిడి
- సెలవులకు కొర్రీలు
- గత నెలలో డ్రైవర్ల ఆందోళన
- అయినా.. మారని అధికారుల తీరు..!


అధికారుల వేధింపులు మానుకోవాలని నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ డ్రైవర్లు(ఫైల్)

మెదక్ అర్బన్, జూలై 5: ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు పనిభారంతో సతమతమవుతున్నారు. ఒత్తిడితో అనారోగ్యానికి గురైనా.. సిబ్బంది కొరత ఉందంటూ అదనపు పనులు అప్పగిస్తున్నారని ఉద్యోగులు గగ్గోలు పెడుతున్నారు. ఇదేంటని ప్రశ్నించిన టార్గెట్ చేస్తున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెదక్ డీఎం, సీఐ, ఇతర అధికారుల వేధింపులు తాళలేక గత నెలలో మూడు రోజులపాటు డ్రైవర్లు శాంతియుత నిరసనకు దిగారు. సుదీర్ఘచర్చల తర్వాత సమస్యల పరిష్కారానికి యాజమాన్యం దిగి రావడంతో తిరిగి డ్రైవర్లు విధుల్లో చేరారు. అయినప్పటికీ అధికారుల్లో మార్పు రావడం లేదని డ్రైవర్లు వాపోతున్నారు. ఓ వైపు పనిభారం.. మరోవైపు అధికారుల వేధింపులతో ఉద్యోగ, కార్మికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

మెదక్ ఆర్టీసీ పరిధిలో 71 మంది డ్రైవర్లు, 180 మంది కండక్టర్లు ఉండగా.. ఆర్టీసీ బస్సులు 44, అద్దె బస్సులు 55 ఉన్నాయి. మోటార్ వెహికల్ చట్టం ప్రకారం 8 గంటల వరకు మాత్రమే డ్యూటీ చేయాలి. కానీ, మెదక్ డిపో పరిధిలో 12 నుంచి 16 గంటలు విధుల్లో ఉండే పరిస్థితులు కల్పిస్తున్నారని ఉద్యోగులు, కార్మికులు ఆరోపిస్తున్నారు.

మహిళా కండక్టర్లుకూ సెలవుల్లేవ్..

ఆర్టీసీడ్రైవర్లు, కండక్టర్లతోపాటు కార్మికులు, ఇతర సిబ్బందికి సెలవులు మంజూరు చేయకుండా ఉన్నతాధికారులు పలు కొర్రీలు పెడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మహిళా కండక్టర్లకు సైతం సెలవులు మంజూరు చేయడం లేదని తెలుస్తోంది. సెలవు అవసరమైతే డబుల్ డ్యూటీ చేయాలని నిబంధన పెడుతున్నట్లు వినికిడి. డిపో అధికారులు, సూపర్‌వైజర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా.. కార్మిక సంఘాలు, సంక్షేమ మండళ్లు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నాయని, ఇక తమ కష్టాలు ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని ఉద్యోగ, కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోజుకు 360 కిలోమీటర్లు..

గతంలో విధులు నిర్వహించే ఒక్కో డ్రైవర్ బస్సును రెండు రోజుల్లో 540 కిలో మీటర్ల నడిస్తుండగా.. ప్రస్తుతం రోజుకు 360 కిలోమీటర్లు డ్యూటీ చేస్తున్నారు. విధి నిర్వహణలో రోజుకు కిలోమీటర్లు అదనంగా డ్యూటీ చేస్తున్నారు. దాంతో వారిపై పని భారం పెరిగి అనారోగ్యాల పాలవుతున్నారు. మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ పెరిగింది. సాధారణంగా బస్సులో 50 ఉంచి 60 మంది ప్రయాణికులు ఎక్కాల్సి ఉండగా.. 120 నుంచి 150 మంది వరకు ప్రయాణిస్తున్నారు. ప్రయాణికులు పెరిగిన నేపథ్యంలో కేఎంపీఎల్ ఎలా వస్తుందని వారు వాపోతున్నారు. టార్గెట్లను చేరాలని ఒత్తిడి చేస్తున్నారు. డ్రైవర్లు, కండక్టర్లు ఒక రోజు విధులకు హాజరు కాకపోతే చార్జీషీట్లు జారీ చేస్తూ.. ఆరు నెలల ఇంక్రిమెంట్లను వెనక్కి పంపుతున్నట్లు సమాచారం. అంతేకుండా గైర్హాజరై వారిని నుంచి సంజాయిషీ అడుగుతున్నారు.

పాత నిబంధనలనే అమలు చేస్తున్నాం

మెదక్ డిపోలో సంస్థ పాత నిబంధనలనే అమలు చేస్తున్నాం. ఉద్యోగ, కార్మికులను వేధించడం లేదు. అవసరం ఉన్న ఉద్యోగులతోపాటు, డ్రైవర్లు, కండక్టర్లకు సెలవు మంజూరు చేస్తున్నాం. అదనపు డ్యూటీ ఎవరికీ కేటాయించడం లేదు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా బస్సులు నడపాల్సి ఉంటుంది.

- సుధా, ఆర్టీసీ డీఎం మెదక్

పాఠశాలకు వెళ్తుండగా ప్రమాదం

ప్రధానోపాధ్యాయుడి మృతి

ఆర్టీసీ బస్సు ఢీ కొని అనంతలోకాలకు..


చేర్యాలఆస్పత్రిలో ఉన్నప్పుడు చంద్రశేఖర్

చేర్యాల, జూలై 5: రోజువారీలాగా ఉదయాన్నే పాఠశాలకు వెళుతున్న ఓ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని ఆర్టీసీ బస్సు రూపంలో మృత్యువు కబళించింది. మరికొద్ది నిమిషాలైతే పాఠశాలకు చేరు కోనుండగా అంతలోనే జరిగిన రోడ్డు ప్రమాదంతో ఆయన మృత్యువాత పడ్డారు. వివరాలిలా ఉన్నాయి. సిద్దిపేట పట్టణంలోని పాత కలెక్టరేట్ భవనం సమీపంలో నివాసముంటున్న కోహీర్ చంద్రశేఖర్ (59) ధూళిమిట్ట మండలం కూటిగల్ సమీపంలోని తండా పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. రోజూ చేర్యాల మీదుగా బైక్‌పై పాఠశాలకు వెళుతుండగా, మద్దూరు మండలం నర్సాయిపల్లి మార్గంలోని పట్టణ శివారులో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొంది. దీంతో తీవ్రగాయాలపాలై అపస్మారకస్థితికి చేరుకున్న చంద్రశేఖర్‌ను స్థానికులు చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించడంతో ప్రాథమిక చికిత్స నిర్వహించారు. అక్కడి నుంచి సికింద్రాబాదులోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో ఆయన మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు చేర్యాల ఎస్ఐ ఎస్ఐ దామోదర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. చనిపోయిన కోహీర్ చంద్రశేఖర్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. చంద్రశేఖర్ మృతి పట్ల పలువురు ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.

తల్లిదండ్రులు మందలించడంతో

యువకుడి ఆత్మహత్య


రాజు(ఫైల్)

రాయపోల్, జూలై 5: ఖాళీగా తిరగడం మానేసి ఏదైనా పని చేసుకోవాలని తల్లిదండ్రులు మందలించడంతో కొడుకు ఆత్మహత్య చేసుకున్న ఘటన రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామంలో శుక్రవారం జరిగింది. బేగంపేట ఎస్ఐ భువనేశ్వర్ కథనం ప్రకారం.. ఎల్కల్ గ్రామానికి చెందిన మంద నర్సింలు, యేసుమని దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు రాజు(24) కొన్ని రోజుల నుంచి ఏ పని చేయకుండా ఖాళీగా తిరుగుతున్నాడు. దీంతో ఏదైనా పని చేసుకోవాలని గురువారం తల్లిదండ్రులు మందలించారు. దీంతో రాజు ఇంటి నుంచి బయటకు వచ్చాడు. రాత్రి వరకు తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు గ్రామంలో వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం ఉదయం తండ్రి నర్సింలు తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి చూడగా, రాజు చింత చెట్టుకు ఉరి వేసుకుని కనిపించాడు. తండ్రి నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి మొక్కలు స్వాధీనం.. ఇద్దరి అరెస్ట్


ఖేడ్ మండలం హంగర్గ.బిలో గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

నారాయణఖేడ్, జూలై 5: మండలంలోని హంగర్గ.బి శివారులోని కంకర క్రషర్ మిషన్ ఆవరణలో సాగు చేస్తున్న 16 గంజాయి మొక్కలను పోలీసులు స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఎస్ఐ విద్యాచరణరెడ్డి కథనం ప్రకారం.. హంగర్గ.బి శివారులోని కంకరమిల్లులో ఉత్తరప్రదేశ్‌లోని ఘాజీపూర్ ఘరిహాకు చెందిన నవీన్‌కుమార్(33), అదే రాష్ట్రంలోని చెర్రయ్ కోట్ పట్టణ సమీపంలోని హఫీజ్‌పూర్‌కు చెందిన సంతోష్‌కుమార్(36)లు పని చేస్తున్నారు. వీరికి గంజాయి పీల్చే అలవాటు ఉండటంతో అక్కడి నుంచి వచ్చే సమయంలోనే కొంత ఎండు గంజాయి వెంట తెచ్చుకున్నారు. కొన్ని ఎండు విత్తనాలను కంకరమిల్లు సమీపంలోని పిచ్చి మొక్కల మధ్య చల్లడంతో అవి పెరిగాయి. విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి అక్కడి 16 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్ట్ చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


యాదయ్య (ఫైల్)

రాయపోల్, జూలై 5: ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపానికి గురై ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బేగంపేట ఎస్ఐ భువనేశ్వర్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామానికి చెందిన జాల యాదయ్య(55) వ్యవసాయంతోపాటు గ్రామంలో టీ పాయింట్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉండగా ఇద్దరికి వివాహాలయ్యాయి. ఏడాది క్రితం కొత్త ఇంటిని నిర్మించుకున్నాడు. దీంత సుమారు రూ. 4లక్షలు అప్పులయ్యాయి. అయితే, అప్పు ఎలా తీర్చాలని తరచూ భార్యతో చెప్పుకుని మదన పడేవాడు. గురువారం రాత్రి 10 గంటలకు తన టీ పాయింట్ వద్ద పడుకుంటానని చెప్పి వెళ్లాడు. శుక్రవారం తెల్లవారినా రాకపోవడంతో వెళ్లి చూడగా ఎక్కడా కనిపించలేదు. సాయంత్రం గ్రామ సమీపంలో విద్యుత్ టవర్‌కు ఉరివేసుకుని ఉండగా, గ్రామస్తులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ మేరకే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కర్ణాటక నుంచి తీసుకొస్తున్న డీజిల్ పట్టివేత

మునిపల్లి, జూలై 5: కర్ణాటక నుంచి అక్రమంగా డీజిల్‌ను తరలిస్తుండగా శుక్రవారం మునిపల్లి పోలీసులు పట్టుకున్నారు. మునిపల్లి ఏఎస్ఐ బిక్షపతి కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన విజయ్‌కుమార్ అక్కడి నుంచి బొలేరో వాహనంలో అక్రమంగా డీజిల్ తీసుకవచ్చి మునిపల్లి మండలంలోని మైనింగ్‌లో పనిచేస్తున్న వాహనాలకు విక్రయిస్తున్నాడు. శుక్రవారం 161 ముంబై జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా, డీజిల్ అక్రమంగా రవాణా చేస్తున్న విషయం బయటపడింది. దీంతో 560లీటర్ల డీజిల్‌ను సీజ్ చేసినట్లు ఏఎస్ఐ బిక్షపతి తెలిపారు. సివిల్ సప్లయ్ ఎమ్మార్వో స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి


అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, జులై 5: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన గ్రామీణ మహిళా శక్తి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళా సాధికారత ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తయారు చేసేందుకు మహిళా క్యాంటీన్‌లను ఏర్పాటు చేసి, జిల్లాలోని ఆయా బ్యాంకుల స్త్రీనిధి ద్వారా మహిళా శక్తి యూనిట్ల లబ్ధిదారుల ఎంపిక చేయాలన్నారు. వివిధ రకాలైన ఈవెంట్ మేనేజ్‌మెంట్, మైక్రో ఎంటర్‌ప్రైజెస్, వ్యవసాయ పరికరాలు, పాడి పరిశ్రమ, కోళ్ల పెంపకం, మహిళా క్యాంటీన్ తదితర 13 రకాల యూనిట్ల ద్వారా మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయాలన్నారు. మహిళాశక్తి లబ్ధిదారులకు యూనిట్లు గ్రేడింగ్ వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు మహిళా సంఘాలతో సమన్వయం చేసుకుని సబ్సిడీ పథకాలను విరివిగా అందించాలని, ఇందుకు బ్యాంకర్లు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిణి జ్యోతి, అదనపు డీఆర్‌డీవో జంగారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి

సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బాలనర్సయ్య


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కొండపాక, జూలై 5: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, కార్మికుల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఐఓఈ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో బైఠాయించి అధికారులు లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు అమ్ముల బాలనర్సయ్య గ్రామపంచాయతీ కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొమురయ్య మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ కార్మికులకు 9 నెలల నుంచి జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుపరచాలని కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కొండపాక, కుకునూరుపల్లి మండలాల అధ్యక్ష, కార్యదర్శులు జాలిగామా ప్రభాకర్, భోగి సాయికుమార్, ఏలేశ్వరం రవీందర్ నాయకులు పల్లె శ్రీనివాస్ గొడుగు నారాయణ, దున్న మల్లవ్వ, పిల్లి లచ్చవ్వ తదితరులు పాల్గొన్నారు.

జల్ జీవన్ మిషన్‌తో సురక్షిత నీరు


నల్లాలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

నిజాంపేట, జూలై 5: జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందుతుందని కేంద్ర బృంద సభ్యులు డి. శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి బిక్షపతి అన్నారు. జల్ జీవన్ మిషన్‌లో భాగంగా మండల పరిధిలోని రజాక్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన నల్లాలను శుక్రవారం కేంద్రబృందం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు నీటి సరఫరా, నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు నీటి ట్యాంకులను శుభ్రం చేసుకోవాలని, నీటిని వృథా చేయవద్దని సూచించారు. అలాగే మిషన్ భగీరథ నీటిని ఇంటింటికి సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గీతాంజలి, గ్రామస్తులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ స్టేడియంలో లాంగ్ జంప్ చేస్తున్న విద్యార్థి

ఉత్సాహంగా అథ్లెటిక్స్ ఎంపికలు

సంగారెడ్డి అర్బన్, జూలై 5: సంగారెడ్డిలోని అంబేద్కర్ స్టేడియంలో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు శుక్రవారం నిర్వహించారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ జావిద్ అలీ పర్యవేక్షణలో ఈ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. 8, 10, 12 ఏళ్ల బాల బాలికలు ఈ ఎంపికల్లో పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 7 న గచ్చిబౌలిలో జరిగే రాష్ట్ర స్థాయి కిడ్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని ఆయన తెలిపారు.

విద్యాభివృద్ధికి కృషి చేయండి

- జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్


మాట్లాడుతున్న ఎంపీ సురేష్ షెట్కార్

జహీరాబాద్, జూలై 5: విద్యాభివృద్ధికి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు కృషి చేయాలని జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని బసవ మంటపంలో ప్రైవేటు (ట్రస్మా) పాఠశాలల యాజమాన్యాల ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీని సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ సురేష్ షెట్కార్ మాట్లాడుతూ, విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యార్థులు తమ ఉన్నతికి కారణమైన గురువులను ఎన్నటికీ మర్చిపోరని, వారు ఎక్కడ కనిపించినా ఆప్యాయతతో దగ్గరకు వచ్చి చేతులు జోడించి నమస్కరిస్తారన్నారు. సమాజంలో గురువుకు దక్కే గౌరవం మరెవ్వరికి ఉండదని ఆయన గుర్తు చేశారు. విద్యార్థులకు నాణ్యవంతమైన విద్యను అందించే బాధ్యత ఉపాధ్యాయులదే అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాభివృద్ధికి చేస్తున్న కృషి అమోఘమైనదన్నారు. కార్యక్రమంలో ట్రస్మా నాయకులు క్రిష్టారెడ్డి, దశరథ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్, తదితరులు పాల్గొన్నారు. ట్రస్మా నాయకులు ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్‌ను పూలమాలలు, శాలువతో ఘనంగా సన్మానించారు. పట్టణంలోని గడీ వీధికి చెందిన వేణుగోపాల్‌రెడ్డి, విజయలక్ష్మిల కుమార్తె, అంధ విద్యార్థిని శివానీ ఐఐఎంకు ఎంపిక కావడంతో ఆమె తల్లిదండ్రులను ఎంపీ సన్మానించారు.

రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు పరామర్శ

నారాయణఖేడ్, జూలై 5: విహార యాత్రకు వెళ్లి తిరిగి వస్తుండగా, మహారాష్ట్ర పూణెలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పట్టణానికి చెందిన మహబూబ్‌ఖురేషి, రఫీక్ ఖురేషిల కుటుంబాలను ఎంపీ సురేష్ షెట్కార్ పరామర్శించారు. ఆయన వెంట జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యులు రషీదు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తాహేర్ అలీ, మైనోద్దిన్, దిల్‌దార్‌ఖాన్, సుభురు, గౌస్ చిష్తీ, తదితరులు ఉన్నారు.

ఏటీఎంలలో చోరీకి యత్నం..



రామాయంపేట, జూలై 5: పట్టణంలో గురువారం అర్ధరాత్రి దుండగులు ఏటీఎంల్లో చోరీకి విఫలయత్నం చేశారు. ఎంత కష్టపడ్డా మిషన్లు తెరుచుకోకపోవడంతో వాటిని రాళ్లతో ధ్వంసం చేశారు. రెండు గ్యాంగులుగా వచ్చిన దుండగలు కామారెడ్డి పాత హైవేలోని రెండు ఏటీఎంలలో దోపిడీకి ప్రయత్నించారు. అయితే, ఎంతకూ మిషన్లు తెరుచుకోలేదు. రాళ్లు తెచ్చి మిషన్లు ధ్వంసం చేసినా.. డబ్బు దొరకలేదు. దీంతో తమ ప్రయత్నం మానుకుని వెళ్లిపోయారు. ఎస్ఐ రంజిత్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భర్తను హత్య చేయించిన భార్య

- మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని..
- ప్రియుడితో కలిసి ఘాతుకం
- నిందితురాలి సహా మరో ముగ్గురు అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సురేష్‌కుమార్, సీఐ క్రాంతికుమార్

జీడిమెట్ల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): దారుణహత్యకు గురైన అంబులెన్స్ వ్యాపారి అనిల్‌కుమార్ హత్య కేసును నగరంలోని జగద్గిరిగుట్ట పోలీసులు ఛేదించారు. ఈ కేసులో భార్యే హంతకురాలని తేల్చి.. ఆమెతో పాటు ఈ హత్యలో భాగస్వాములైన మరికొందరిని శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. భర్త మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగించడం, ఆమెకు ఆస్తిలో వాటా ఇస్తాననడంతో భార్య పథకం ప్రకారం ఈ హత్య చేయించినట్లు పోలీసులు నిర్ధారించారు.

బాలానగర్ డీసీపీ కె. సురేష్‌కుమార్, జగద్గిరిగుట్ట సీఐ క్రాంతికుమార్‌లు కేసు వివరాలను వివరించారు. వారి కథనం ప్రకారం.. మెదక్ జిల్లా అల్లాదుర్గంకు చెందిన గాజుల అనిల్‌కుమార్ అలియాస్ అనిల్ (35), భాగ్యలక్ష్మి భార్యాభర్తలు. ఇద్దరూ హైదరాబాద్‌కు వచ్చి కూకట్‌పల్లి ప్రాంతంలోని ఓ అద్దె ఇంట్లో ఉండగా, అనిల్ మొదట డ్రైవర్‌గా పని చేశాడు. భాగ్యలక్ష్మి స్కూల్‌లోనూ, వస్త్ర దుకాణంలోనూ పని చేసింది. తర్వాత అనిల్‌కుమార్ పాత అంబులెన్స్ కొనుగోలు చేసి సొంతంగా తిప్పేవాడు. ఆర్థికంగా స్థిరపడిన తర్వాత మరో ఐదు అంబులెన్స్‌లు కొనుగోలు చేశాడు. భాగ్యలక్ష్మి కూకట్‌పల్లిలోని జయనగర్‌లో సొంత బ్యూటీపార్లర్ పెట్టింది. వీరికి ఒక బాబు, పాప ఉన్నారు. అయితే, అనిల్‌కు బంధువైన ఓ మహిళ గోషామహల్ ప్రాంతంలో భర్త పిల్లలతో కలిసి ఉండేది. కరోనా సమయంలో అనిల్ భార్యపిల్లలు సొంత ఊరికి వెళ్లగా, గోషామహల్ ప్రాంతంలో ఉండే మహిళ అనిల్‌కు దగ్గరైంది. ఇద్దరి మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. దీంతో ఆమె భర్తను వదిలేసి పిల్లలతో కలిసి కూకట్‌పల్లికి వచ్చేసింది. ఆమెకు అద్దె ఇంట్లో ఉంచిన అనిల్ ఆమెతోనే ఉండేవాడు. విషయం తెలుసుకున్న భాగ్యలక్ష్మి భర్తను నిలదీసింది. దీంతో భార్యను నిత్యం కొట్టేవాడు.

ఇదే క్రమంలో శ్రీనివాస్‌నగర్‌లో సొంత ఇల్లు కొనుగోలు చేసి తనతో సంబంధం ఉన్న మహిళను అక్కడ ఉంచాడు. మియాపూర్‌లో టిఫిన్ సెంటర్ ఏర్పాటు చేశాడు. భార్య కృష్ణవేణితో పాటు సదరు మహిళ టిఫిన్ సెంటర్ నిర్వహించేవారు. టిఫిన్ సెంటర్‌లో ఆల్విన్ కాలనీకి చెందిన మార్తాండా మల్లేష్(28) వంటమాస్టర్‌గా పని చేసేవాడు. టిఫిన్ సెంటర్‌ను జగద్గిరిగుట్ట వెంకటేశ్వరనగర్‌కు మార్చాడు. అయితే, భర్త తనను పట్టించుకోకుండా మరో మహిళతో గడుపుతుండటంతో భాగ్యలక్ష్మి టిఫిన్ సెంటర్‌లో పని చేస్తున్న వంట మనిషికి దగ్గరైంది. అతనితో సంబంధం పెట్టుకుంది. ఇదే క్రమంలో అనిల్‌కుమార్ తనతో సంబంధం పెట్టుకున్న మహిళకు అబులెన్స్‌లలో, తాను కొనుగోలు చేసిన ఇంట్లో భాగం ఇస్తానని చెప్పడంతో కృష్ణవేణికి ఆగ్రహం తెప్పించింది. తన ప్రియుడు మల్లేష్‌తో కలిసి భర్తను హత్య చేయాలని పథకం వేసింది.

అంబులెన్స్ డ్రైవర్లకు సుపారీ ఇచ్చి..

భాగ్యలక్ష్మి అనిల్ దగ్గర అంబులెన్స్‌లపై డ్రైవర్లుగా పని చేస్తున్న వివేకానందనగర్ కాలనీలో ఉంటున్న నర్సింహ అలియాస్ నాని(27), సూరారానికి చెందిన నీరుడి నవీన్(26)ను కలుపుకుని, వారికి అంబులెన్స్‌లలో భాగమిస్తానని ఒప్పించి, భర్త హత్యకు పథకం ప్రియుడితో కలిసి పథకం పన్నింది. రూ. 2 లక్షలు నగదు కూడా ఇవ్వడానికి అంగీకరించి, రూ. 50 వేలు అడ్వాన్స్‌గా ఇచ్చింది. ఇందులో నర్సింహ తన స్నేహితులు రాజు, సంజు అనే వారిని కూడా కలుపుకుని గత నెల 28న రాత్రి ఇంట్లో మద్యం తాగుతున్న అనిల్‌కుమార్‌తో కలిసి మద్యం తాగారు. ఈ క్రమంలో బాటిళ్లు పగులగొట్టి అనిల్‌కుమార్ కడుపులో పొడిచి, బ్లేడ్‌తో గొంతు కోసి చంపేశారు. రక్తపు దుస్తులను ఎల్లమ్మబండ శ్మశాన వాటికలో పడేశారు. ఉదయం అనిల్‌కుమార్‌తో సంబంధం పెట్టుకున్న మహిళ.. ఆమె కుమారుడు వచ్చి చూసి, పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించగా మల్లేష్, భాగ్యలక్ష్మిలు బెదిరించి.. వారితోనే రక్తపు మరకలను కడిగించి.. అనిల్ కుమార్‌ను ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అనిల్ మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. జగద్గిరిగుట్ట సీఐ క్రాంతికుమార్ కేసు దర్యాప్తు చేపట్టి, అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించగా, నేరం అంగీకరించారు. భాగ్యలక్ష్మితో పాటు మల్లేష్, నర్సింహ, నవీన్‌లను అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారని, వారినీ త్వరలోనే అరెస్ట్ చేస్తామని డీసీపీ కె. సురేష్‌కుమార్ తెలిపారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

50 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

చిన్నకోడూరు, జూలై 5 : అక్రమంగా నిల్వచేసిన 50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, చిన్నకోడూరు పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్ గ్రామంలోని ఓ ఇంట్లో అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వచేశారనే సమాచారం మేరకు గురువారం అర్ధరాత్రి సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, చిన్నకోడూరు పోలీసులు కలిసి వెళ్లి తనిఖీ చేశారు. అక్కడ నిల్వ ఉన్న 50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఇబ్రహీంనగర్‌కు చెందిన రాజు, సిద్దిపేట పట్టణానికి చెందిన నిశాన్ గౌడ్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. గ్రామాలను టార్గెట్ చేసుకుని కొందరు రేషన్ బియ్యాన్ని సేకరించి తరలిస్తున్నట్లు అనుమానిస్తున్నారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న బియ్యం

సదరం క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు

శివ్వంపేట, జూలై 5: మెదక్ జిల్లా గ్రామీణాభివృద్ధిసంస్థ ఆధ్వర్యంలో జిల్లా ఆస్పత్రిలో జూలై 9 నుంచి సదరం క్యాంపులు నిర్వహించనున్నట్టు డీఆర్డీఏ పీడీ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. అర్హులు ఈ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జూలైన 9న దృష్టిలోపం, 10న శారీరక లోపం, 18న మూగ, వినికిడి లోపం, 19న శుక్రవారం మానసిక వికలాంగుల వైకల్యాలను పరిశీలించి అర్హులైన వారికి ధ్రువపత్రాలను అందజేయనున్నట్టు తెలిపారు. లబ్ధిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సహారా రిహాబిలిటేషన్ సెంటర్ తనిఖీ



రిహాబిలిటేషన్ సెంటర్‌లో సేవలపై ఆరా తీస్తున్న జిల్లా సంక్షేమాధికారి లలితకుమారి

సంగారెడ్డి అర్బన్, జూలై 5: సంగారెడ్డిలోని సహారా ఆరోగ్య అభివృద్ధి సంస్థకు చెందిన ప్రైమరీ రిహాబిలిటేషన్ సెంటర్‌ను జిల్లా సంక్షేమాధికారి లలితాకుమారి శుక్రవారం సందర్శించారు. సెంటర్‌లో చికిత్స కోసం వస్తున్న పిల్లలను విచారించి, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. పిల్లలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. జిల్లా వ్యాప్తంగా పిల్లల ఎదుగుదలలో లోపం ఉంటే ఫిజియోథెరపి, స్పీచ్ థెరపి, బిహేవియర్ థెరపి, ఆక్యుపేషనల్ థెరపి సేవలను సెంటర్ ద్వారా ఉచితంగా పొందాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మఠం శంకర్, డా.భవ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

జహీరాబాద్, జూలై 5: వర్షాకాలం దృష్ట్యా వైద్యసిబ్బంది అప్రమత్తంగ ఉండాలని మల్‌చెల్మ పీహెచ్‌సీ వైద్యుడు నవనీత్ పేర్కొన్నారు. శుక్రవారం మల్‌చెల్మ పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ వర్షాకాలంలో నీళ్లవిరేచనాలు, డెంగ్యూ, మలేరియా, తదితర వ్యాధులు సోకే అవకాశం ఉందన్నారు. వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు ఎప్పటికప్పుడు గ్రామాలవారీగా వివరాలను పీహెచ్‌సీ సిబ్బందికి తెలియజేయాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీహెచ్‌వో యాదుల్లా, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు రెండో విడత నోటిఫికేషన్

సంగారెడ్డి అర్బన్, జూలై 5 : ఐటిఐలో ప్రవేశాలకు రెండో విడత నోటిఫికేషన్ జారీ చేసినట్టు ప్రిన్సిపాల్ రాజేశ్వర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15 వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వచ్చే ఆగస్టు 1వ తేదీ నాటికి 14 ఏళ్లు నిండిన వారు అర్హులని పేర్కొన్నారు. వివిధ ట్రేడుల్లో ప్రవేశాల పొందాలనుకునే వారు సంబంధిత వెబ్ సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

డీఈవోను కలిసిన టీజీపీఎస్ నాయకులు

సంగారెడ్డి రూరల్, జూలై 5: జిల్లాలో ఇటీవల జరిగిన ప్రధానోపాధ్యాయుల పదోన్నతులు, ఉపాధ్యాయుల బదిలీలు, వివిధ సమస్యలను విజవంతంగా పూర్తి చేసినందుకు గాను (టీజీపీఎస్) తెలంగాణ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకులు శుక్రవారం డీఈవో వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. డీఈవోను కలిసిన వారిలో సంఘం రాష్ట్ర నాయకుడు సచ్చిదానందరెడ్డి, జిల్లా నాయకుడు జగదీశ్వర్, డీసీఈబీ కార్యదర్శి లింబాజీ, భాస్కర్, జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి ఉన్నారు.

సంక్షేమ ఫలాలు అందరికీ అందేలా కృషి

ఎంపీపీల పదవీకాలం ముగియడంతో సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో మండల ప్రత్యేకాధికారులను నియమిస్తూ ఆయా జిల్లాల కలెక్టర్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు పలు మండలాల్లో ప్రత్యేకాధికారులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

కొల్చారం, జూలై 5: అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందరికి అందేలా చూస్తానని జిల్లా విద్యాధికారి, కొల్చారం మండల ప్రత్యేకాధికారి రాధాకిషన్ తెలిపారు. కొల్చారం మండల ప్రత్యేకాధికారిగా జిల్లా విద్యాధికారి రాధాకిషన్ శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఎంపీపీల పదవీకాలం ముగియడంతో మండలానికి జిల్లా విద్యాధికారి రాధాకిషన్‌ను నియమిస్తూ మెదక్ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన డీఈవోను ఎంపీడీవో లక్ష్మీనర్సింహులు, ఎంఈవో నీలకంఠం తదితరులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఏపీవో మహిపాల్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కొల్చారం: మండల ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరించిన డీఈవోకు సన్మానం

సమస్యల పరిష్కారానికి కృషి చేద్దాం

కొండాపూర్, జూలై 5: కొండాపూర్ మండల పరిపాలన ప్రత్యేకాధికారిగా జిల్లా కో-ఆపరేటివ్ అధికారి ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మండలాధికారిగా బాధ్యతలు చేపట్టిన ప్రసాద్‌ను ఎంపీడీవో జ్యోతిలక్ష్మి, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సంఘం నాయకులు ఘన స్వాగతం పలికారు. పూల గుచ్ఛాలు, శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో నెల కొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా పనిచేద్దామంటూ మండల పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సమావేశంలో మండలాధికారులు శ్రీనివాస్ పంచాయతీ కార్యదర్శులు కిషోర్,వనజ,శ్రీనివాస్, మన్మోహన్, లావణ్య పాల్గొన్నారు.



కొండాపూర్: బాధ్యతలు చేపట్టిన డీసీవో ప్రసాద్‌ను సన్మానం చేస్తున్న మండలాధికారులు,కార్యదర్శులు

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

మునిపల్లి, జూలై 5: మునిపల్లి మండల ప్రత్యేకాధికారిగా జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారిని నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీడీవో హరినంద్‌రావు, ఇన్‌చార్జి ఎంపీవో నాగలక్ష్మి, సూపరింటెండెంట్ రామలింగం, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది రామాచారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడుతూ.. మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

గతంలో పని చేసిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

● ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమ ఎదుట ఆందోళన



పరిశ్రమ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

హత్నూర, జూలై 5: గతంలో పరిశ్రమలో పని చేసిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ హత్నూర మండలం చందాపూర్ గ్రామ శివారులోని ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమ ఎదుట శుక్రవారం కార్మికులు ఆందోళన చేపట్టారు. ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమలో నెల క్రితం భారీ పేలుళ్లు సంభవించి పరిశ్రమలో ఐదుగురు మృతి చెందడంతో పాటు పరిశ్రమ యూనిట్-1 భవనం పూర్తిగా ధ్వంసం అయ్యింది. దీంతో కొంతకాలంగా పరిశ్రమ పని చేయడం లేదు. ప్రస్తుతం పరిశ్రమ పనులు నిర్వహిస్తుండటం వల్ల గతంలో పని చేసిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పరిశ్రమ ఎదుట కార్మికులు ఆందోళన చేపట్టారు. తాము పరిశ్రమను నమ్ముకుని పని చేశామని, ప్రస్తుతం పరిశ్రమలో తిరిగి పని చేస్తామంటే ఎందుకు పని ఇవ్వడం లేదంటూ కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులను తొలగిస్తే ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామన్నారు.



సంగారెడ్డి కోర్టులో పీపీ శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి భవానీచంద్ర

పీపీ శ్రీనివాస్‌రెడ్డికి ఘన సన్మానం

సంగారెడ్డి రూరల్, జూలై 5 : సంగారెడ్డి జిల్లా కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వహించి పదవీవిరమణ పొందిన శ్రీనివాస్‌రెడ్డిని శుక్రవారం జిల్లా ప్రధాన న్యాయాధికారి భవానీచంద్ర ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ సుజనారెడ్డి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నార్సింగి పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



ఆసుపత్రిలో ల్యాబ్, స్టోరూంలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

చేగుంట, జూలై 5: వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ వ్యాధులు సోకే అవకాశం ఉంటాయని వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ ఆదేశించారు. నార్సింగి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్యకేంద్రంలో శస్త్ర చికిత్సగదిని, మందుల స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు సోకకుండా అన్ని వైద్య కేంద్రాలలో డాక్టర్లను వైద్యసిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. ఆరోగ్య కేంద్రాలలో కావలసిన మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని ఏఎన్ఎం, ఆశావర్కర్లు ప్రతిరోజూ ఇంటింటా సర్వేలు నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. గ్రామంలో డెంగ్యూ ఐదు కంటే ఎక్కువ నమోదైతే గ్రామంలో డాక్టర్లతో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తామన్నారు. నార్సింగి ఆరోగ్య కేంద్రంలో రెండు స్టాఫ్ నర్సు పోస్టులు ఖాళీగా ఉన్నాయని డాక్టర్ రవికుమార్ జిల్లా వైద్యాధికారి దృష్టికి తీసుకురాగా త్వరలో భర్తీ చేస్తామన్నారు.

పత్తిలో జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడి



సిధోల్‌లో పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

రేగోడు జూలై 5: పత్తి పంటలో రైతులు తగు జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ తెలిపారు. శుక్రవారం రేగోడు మండలంలోని సిధోల్ గ్రామంలో ఆరుతడి పంటలైన పత్తి, మినుము, జొన్న, పెసర పంటలను జిల్లా వ్యవసాయ అధికారి పరిశీలించారు. రైతులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పంటలో ఎక్కువగా రసం పీల్చే పురుగులు, పచ్చదోమ, పేనుబంక ఆశించి పంటలను పాడు చేస్తున్నాయని అన్నారు. వీటిని నివారణకు కాండపు పూత పద్ధతి ద్వారా పంటను 60 రోజుల వరకు కాపాడుకోవచ్చని అన్నారు. కాండనికి మందు పూసే పద్ధతిలో 30, 45 రోజులలో మోనోక్రోటోఫాస్, నీరు 1:4 నిష్పత్తిలో 60 రోజుల వయస్సులో ఇమిడాక్లోప్రిడ్, నీరు 1:20 నిష్పత్తిలో పూయాలి లేదా ఎ సీటామిప్రిడ్ 0.20 గ్రా లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. రైతులు మాట్లాడుతూ ఉల్లి పంట అధికంగా పండిస్తామని, ఉల్లి విత్తనాలను సబ్సిడీపై అందించాలని కోరారు. ఆయన వెంట ఏవో జావీద్, ఏఈవో సునీల్ కుమార్ తదితరులు ఉన్నారు.

స్వచ్ఛ వాతావరణం కల్పించడమే లక్ష్యం

'క్లీన్ ఇండియా.. హెల్త్ ఇండియా' కార్యక్రమంలో బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి



సంగారెడ్డిలోని వినాయక్‌సాగర్ చెరువుకట్టపై పిచ్చిమొక్కలు తొలగిస్తున్న బీజేపీ నాయకులు

సంగారెడ్డి అర్బన్, జూలై 5: బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా సంగారెడ్డిలోని వినాయక్‌సాగర్ చెరువుకట్టపై 'క్లీన్ ఇండియా హెల్త్ ఇండియా' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ చెరువులు, కుంటలను శుభ్రపరచి పట్టణ వాసులకు మంచి నీరు, స్వచ్ఛమైన గాలి అందించడమే ప్రధాని మోదీ ఆశయమన్నారు. కార్యక్రమంలో భాగంగా చెరువు కట్ట పరిసరాల్లో పెరిగిన మొక్కలు, చెత్తా చెదారం శుభ్రం చేసి వ్యర్థాలను తొలగించారు. పట్టణ అధ్యక్షుడు ద్వారక రవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, అధికార ప్రతినిధి డా.రాజుగౌడ్, కార్యాలయ కార్యదర్శి విజయ్, నాయకులు పాల్గొన్నారు.

● **జహీరాబాద్:** జిల్లా వ్యాప్తంగా ప్రతిబూత్‌కు చెందిన కార్యకర్తలు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు సంఘటితంగా కృషి చేద్దామని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి పేర్కొన్నారు. మండలపరిధిలోని హోతి(బి) గ్రామంలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతీ బూత్‌లో కనీసం 10మొక్కలైన నాటాలని కార్యకర్తలకు, నాయకులకు విజ్ఞప్తి చేశారు. 'ఏక్ పేడ్.. మాకే నామ్' పేరిట ప్రతీ కార్యకర్త మొక్కలను నాటాలని చెప్పారు. అదే విధంగా క్లీన్‌ఇడియా, హెల్త్ ఇండియ పేరుతో చెరువులు, నీటివనరులపై శ్రద్ధ చూపుతూ ప్లాస్టిక్ కాలుష్యరహిత సమాజ నిర్మాణానికి అందరం కృషిచేద్దామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు శ్రీనివాస్‌గౌడ్, కిష్టన్న, సుభాష్‌రెడ్డి, బీజేపీ జిల్లా నాయకులు రాజశేఖర్‌రెడ్డి, క్రిష్టారెడ్డి, గోవింద్‌రెడ్డి, మల్లాఖార్జున్‌స్వామి, ప్రభాకర్‌రెడ్డి, జగన్నాథం, ఓబీసీమోర్చా జిల్లాఅధ్యక్షుడు శివాజీపాటిల్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ నౌబాద్‌జగన్, పట్టణ, ఆయా మండలాల పార్టీల అధ్యక్షులు , కార్యకర్తలు, తది తరులు పాల్గొన్నారు.

● **జోగిపేట:** బీజేపీ జోగిపేట శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం 'ఏక్ పేడ్.. మాకే నామ్' పేరిట మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు తలా ఒక మొక్కను నాటారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్. ప్రభాకర్ గౌడ్, నియోజకవర్గ మాజీ కన్వీనర్ ఆర్. ప్రభాత్‌కుమార్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రారం మాణయ్య, సీనియర్ నాయకులు శ్యామాగౌడ్, సతీష్, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు



సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో పీడీఎస్‌యూ నాయకులు

సంగారెడ్డి అర్బన్, జూలై 5 : విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం చలో సెక్రటేరియేట్ కార్యక్రమానికి పీడీఎస్‌యూ శుక్రవారం పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌కు వెళ్లకుండా సంగారెడ్డి జిల్లా పీడీఎస్‌యూ నాయకులను సంగారెడ్డి రూరల్ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేశ్ మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సందీప్, నాయకులు అర్జున్, సిద్ధార్థ్, బన్నీ, అఖిల్, నిఖిల్ తదితరులు ఉన్నారు.

● జహీరాబాద్/న్యాల్‌కల్: అక్రమఅరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని బీఆర్ఎస్, పీడీఎస్‌యూ, విద్యార్థిసంఘాల నాయకులు రాకేష్, నర్సింహారెడ్డి, తదితరులు పేర్కొన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం చలో సెక్రటేరియట్ కార్యక్రమం చేపట్టిన నేపథ్యంలో విద్యార్థిసంఘాల నాయకులను పోలీసులు ఎక్కడికక్కడే అరెస్ట్ చేయడంపై వారి మండిపడ్డారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నదని విమర్శించారు. గతప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం కూడా అదేబాటలో కొనసాగుతుందన్నారు. యూనివర్సిటీల్లో, కళాశాలల్లో వీసీలను, అధ్యాపకులను నియమించలేదన్నారు. ధ్వంసమైన విద్యారంగాన్ని పునర్నిర్మించుకునేందుకుగాను విద్యార్థిసంఘాల నాయకులు, విద్యార్థులు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తులో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామన్నారు. న్యాల్కల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థిసంఘాల నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టయినవారిలో విద్యార్థిసంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం నాయకుల ముందస్తు అరెస్టులు

నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం రాష్ట్ర శాఖ శుక్రవారం కలెక్టరేట్ల ముట్టడికి పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ని ఆయా మండలాల్లో కలెక్టరేట్ల ముట్టడికి తరలివెళ్తున్న నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టులు చేశారు.

తూప్రాన్, జూలై 5: కలెక్టరేట్ ముట్టడి నేపథ్యంలో తూప్రాన్ పోలీసులు ముగ్గురు బీజేవైఎం నాయకులను ఉదయమే అరెస్టు చేశారు. శుక్రవారం తెల్లవారుజామునే బీజేవైఎం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, సోషల్ మీడియా కన్వీనర్ వినయ్‌ను అరెస్టు చేసినట్లు ఎస్ఐ శివానందం తెలిపారు.

● **శివ్వంపేట:** కలెక్టరేట్ ముట్టడికి వెళ్లనివ్వకుండా పోలీసులు బీజేవైఎం అధ్యక్షుడు భాస్కర్, మండల పార్టీ అధ్యక్షుడు రవితో పాటు బీజేపీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకొని ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టయినవారిలో ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు బిక్షపతి, మండల ఎస్టీ మోర్చా అధ్యక్షుడు భాస్కర్, బీజేవైఎం ఉపాధ్యక్షుడు నాగరాజ్, బీజేపీ నాయకులు ఉన్నారు.

● **పాపన్నపేట:** ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని బీజేవైఎం జిల్లా నాయకుడు శ్రీరాం నరేష్ అన్నారు. శుక్రవారం నిరుద్యోగుల సమస్యలపై కలెక్టరేట్ ముట్టడికి వెళ్లకుండా నాయకులను వారి ఇళ్ల వద్ద ముందస్తు అరెస్టులు చేశారు. అరెస్టయినవారిలో నాయకులు ప్రకాష్, గోపాల్, పెంటయ్య తదితరులున్నారు.



మనోహరాబాద్ పోలీస్ స్టేషన్‌లో బీజేపీ నాయకులు

● **చేగుంట:** బీజేవైఎం ఆధ్వర్యంలో మెదక్ కలెక్టరేట్ ముట్టడికి తరలకుండా శుక్రవారం బీజేవైఎం నాయకులను పోలీసులు ముదస్తుగా అరెస్ట్ చేశారు. బీజేవైఎం మండల శాఖ అధ్యక్షుడు శేఖర్‌గౌడ్ మాట్లాడుతూ నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చడం లేదని ప్రభుత్వంపై మండిపడ్డారు. అరెస్టయినవారిలో మండల కార్యదర్శులు కుమ్మరి నర్సింహులు, కొత్త సంతోష్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

● **మనోహరాబాద్:** చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపట్టిన దృష్ట్యా మండల బీజేపీ నాయకులు కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. మండలంలోని అరెస్టు చేసిన బీజేపీ నాయకులను మనోహరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో మండలంలోని బీజేపీ నాయకులు రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం మాజీ ఉపాధ్యక్షుడు నత్తిమల్లేష్ ముదిరాజ్, జీజేవైఎం జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు కమ్మరి నరేందర్‌చారి, కార్యదర్శులు శ్రీకాంత్, శ్రీశైలం యాదవ్, లక్ష్మణ్ సింగ్ ఠాకూర్, వెంకటేష్‌గౌడ్, కొత్తూరి మల్లేష్, కుమ్మరి నాగరాజు ఉన్నారు.

● **వెల్దుర్తి:** బీజేవైఎం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు చలో కలెక్టరేట్‌కు వెళ్లకుండా మండలంలోని బీజేపీ నాయకులను శుక్రవారం ఉదయం ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టయినవారిలో నాయకులు శేఖర్‌గౌడ్, శ్రీనివాస్, నవీన్ తదితరులు ఉన్నారు.

● **నారాయణఖేడ్:** బీజేవైఎం రాష్ట్ర కమిటీపిలుపు మేరకు శుక్రవారం సంగారెడ్డి కలెక్టరేట్ ముట్టడికి బయలుదేరిన ఖేడ్ మండల బీజేపీ అధ్యక్షుడు దశరత్‌ను సంగారెడ్డి పోలీసులు మార్గమధ్యంలో అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా దశరత్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నిరుద్యోగులను మోసం చేస్తుందన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తులపై కేసు

శివ్వంపేట, జూలై 5: ప్రభుత్వ ఉద్యోగి విధులకు ఆటంకం కలిగిస్తూ, బూతు మాటలతో దూషించిన వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన మండలంలోని రత్నాపూర్ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రత్నాపూర్ గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శి రాములుగారి నాగరాజు గౌడ్ విధులు నిర్వహిస్తుండగా అదే గ్రామానికి చెందిన ఓట్ల రాజు, గాజుల ప్రసాద్ ఇద్దరు వ్యక్తులతో కలిసి కార్యదర్శిపై దౌర్జన్యం చేస్తూ, బూతు మాటలతో దూషించారు. కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహిపాల్ రెడ్డి తెలిపారు.

కేజీవీల్స్‌తో రోడ్లపైకి వస్తే చర్యలు: మెదక్ ఎస్పీ



బాలస్వామి, మెదక్ ఎస్పీ

మెదక్ అర్బన్, జూలై 5: రోడ్లపై కేజీవీల్స్‌తో ట్రాకర్లు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ బాలస్వామి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీటీ రోడ్లపై కేజీవీల్స్‌తో నడపడం ద్వారా గీతలు పడుతూ.. కంకర తేలి ధ్వంసం అవుతున్నాయన్నారు. రోడ్లపైకి వస్తే ట్రాక్టర్ యజమానులపై మోటారు వాహన చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని, ఈ విషయాన్ని గమనించాలని ఎస్పీ సూచించారు

నెంబర్‌ప్లేట్ లేని ద్విచక్ర వాహనాలు సీజ్

చిన్నశంకరంపేట, జూలై 5: ప్రతీ వాహనాదారుడు తమ వాహనాలకు నెంబర్ ప్లేట్లు సరిగా ఉండేలా చూసుకోవాలని చిన్నశంకరంపేట ఎస్ఐ నారాయణగౌడ్ చూచించారు శుక్రవారం మండల కేంద్రంలోని మెదక్- చేగుంట రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తున్న నేపథ్యంలో ఐదు నెంబర్‌ప్లేట్లు లేని ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతీ వాహనాదారుడు వాహన సంబంధిత ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడిపితే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

మహిళలను వేధిస్తే కఠిన చర్యలు



ప్రవీణ్‌రెడ్డి, సీఐ

పటాన్‌చెరు రూరల్, జూలై 5: మహిళలను వేధించటం, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడటం బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగితే ఉపేక్షించబోమని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పటాన్‌చెరు సీఐ ప్రవీణ్‌రెడ్డి హెచ్చరించారు. ఆయన శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి యువకులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకతాయిలు, మహిళలు వేధించిన వారిపై తమకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కొత్త చట్టం అమలులోకి రావడం వల్ల నేరస్తులపై కఠిన చర్యలు ఉంటాయని దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ నేర రహిత సమాజానికి కృషి చేయాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదవుతాయన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు గంజాయి విక్రయాలను పూర్తిగా అదుపులోకి తెచ్చామని, భవిష్యత్తులో ఎవరైనా గంజాయి విక్రయిస్తే చర్యలు మరింత కఠినంగా ఉంటాయని సీఐ హెచ్చరించారు.

మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన

మనోహరాబాద్, జూన్ 5: మండలంలోని కూచారం గ్రామంలో కేజీబీవీలో విద్యార్థులకు మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల అనర్థాలపై తూప్రాన్ ఆర్డీవో జయచంద్రరెడ్డి అవగాహన కల్పించారు. చిన్న వయస్సులో విద్యార్థులు తెలియకుండా మత్తుకు అలవాటుపడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడైనా మత్తు పదార్థాలు కనిపిస్తే ఉపాధ్యాయులకు ఫిర్యాదు చేయాలని, కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృష్ణతేజ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తప్పని సరిగా తీసుకోవాలి



మునిపల్లి పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మనుజారెడ్డి

మునిపల్లి, జూలై 5: గర్భిణులు, బాలింతల కోసం ప్రభుత్వం అందజేసే పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని మునిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మనుజారెడ్డి సూచించారు. శుక్రవారం మునిపల్లి ప్రభుత్వాసుపత్రిలో గర్భిణు లకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మనుజారెడ్డి మాట్లాడుతూ ప్రతి సోమ, శుక్రవారాల్లో గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గర్భిణులను ఆసుపత్రికి తీసుకువచ్చి, ఇళ్లకు పంపేవరకు ఆశావర్కర్లదే బాధ్యత అని చెప్పారు. ఈ విషయంలో ఆశావర్కర్లు నిర్లక్ష్యం చేయరాదని హెచ్చరించారు.

పదవి లేకున్నా ప్రజల మధ్య ఉంటా..



మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ పైతర మీనాక్షి

మునిపల్లి, జూలై 5: గత ఐదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో మండలంలో ప్రజలకు అభివృద్ధిని అందించామని, పదవి లేకున్నా ప్రజల మధ్య ఉంటానని మునిపల్లి మండల తాజా మాజీ జడ్పీటీసీ పైతర మీనాక్షి సాయికుమార్ పేర్కొన్నారు. ఐదేళ్ల పాలనలో చేపట్టి న అభివృద్ధి పనులపై శుక్రవారం స్థానిక విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గత ఐదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జడ్పీటీసీ నిధులతో ఆయా గ్రామాల్లో సీసీ రోడ్లు, బోరు మోటార్లు వేసి ప్రజల ఇబ్బందులను తొలగించామని గుర్తు చేశారు. ఐదేళ్ల పాటు మండలంలోని సహకరించిన ప్రతీ ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రాహుల్ వ్యాఖ్యలను నిరసనగా ధర్నా

పుల్‌కల్, జూలై 5: పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ హిందువులపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ గ్రామం వద్ద సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారిపై బీజేవైఎం కార్యకర్తలు బైఠాయించారు. దీంతో జాతీయ రహదారిపై సంగారెడ్డి వైపు వెళ్లే రహదారి పై వాహనాల రాకపోకలు అరగంట పాటు స్తంభించాయి. రాహుల్‌గాంధీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నీరుడి ప్రవీణ్ కుమార్ ముదిరాజ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు మర్రి మహేష్, ఉపాధ్యక్షుడు మిరియాల రాకేష్, నిజాంపురం సాయికృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంజనీరింగ్ సీట్ల భర్తీకి ధ్రువపత్రాల పరిశీలన

సంగారెడ్డి రూరల్, జూలై 5 : రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో సీట్ల భర్తీకి సంబంధించిన ఎప్‌సెట్‌కు క్వాలిఫై అయిన విద్యార్థులకు ఈ నెల 6వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించనున్నట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున్ తెలిపారు. సంగారెడ్డి మండలం హనుమాన్‌నగర్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్ చేసుకున్న విద్యార్థులు ఎప్‌సెట్ ర్యాంక్ కార్డు, ఎప్‌సెట్ హాల్ టికెట్, ఉత్తీర్ణత సాధించిన ఇంటర్ సర్టిఫికెట్, ఆరవ తరగతి నుంచి ఇంటర్ వరకు బోనఫైడ్ సర్టిఫికెట్లు, కుల, ఆదాయ ధ్రువీకరణ తదితర పత్రాలతో కళాశాలలో హాజరు కావాలని కోరారు.

తునికి నల్ల పోచమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

కౌడిపల్లి, జూలై 5: తునికి నల్ల పోచమ్మ ఆలయం హుండీ కానుకలను ఆలయ ఇన్‌చార్జి ఈవో రంగారావు అధ్వర్యంలో లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ శివరాజు మాట్లడుతూ ఏప్రిల్ 3 నుంచి జూలై 5 వరకు గాను 88 రోజుల ఆదాయం రూ. 4,21,110 ఆదాయం వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ జూనియర్ అసిస్టెంట్ వెంకట్ రెడ్డి, మాజీ ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, పర్వతాలు సిబ్బంది ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల బరువుల పరిశీలన

తూప్రాన్, జూలై 5: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల బరువుల పరిశీలన చేశారు. బరువులను రెడ్డిపల్లి సూపర్‌వైజర్ పరిశీలన చేశారు. తూప్రాన్ పట్టణంలోని 3వ, 7వ, 9వ, 10వ అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం చిన్నారుల బరువుల పరిశీలన చేశారు. రెడ్డిపల్లి (నర్సాపూర్) సెక్టార్ సూపర్‌వైజర్ సుజాత చిన్నారుల బరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు ఇందిర తదితరులు పాల్గొన్నారు.